క్లుప్తంగా

ఆర్‌ఎంపీలకు వైద్యవిజ్ఞానంపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యురాలు నవ్య శృతి

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్‌ఎంపీలకు వైద్యవిజ్ఞానంపై విజయనగరం అజయ్ పిల్లల ఆస్పత్రి వైద్యురాలు ఎం.నవ్య శృతి వైద్య విజ్ఞానంపై అవగాహన కల్పించారు. థైరాయిడ్, షుగర్, బీపీ, చిన్నపిల్లల ఎదుగుదల గురించి చేయాల్సిన వైద్యం గురించి అవగాహన కల్పించారు. ఆర్‌ఎంపీల సంఘం మండల అధ్యక్షుడు రాలి అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి క్షేమం

తగరపువలస: తగరపువలస నుంచి విశాఖ వైపు వెళ్తున్న ఓ ద్విచక్రవాహనదారుడు ఆనందపురం మండలంలోని వేములవలస ఫ్లై ఓవర్‌పై బుధవారం రాత్రి ఆగి ఉన్న లారీని ఢీకొని పడిపోయాడు. స్థానిక పోలీసులు క్షతగాత్రుని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉండటంతో చికిత్స అనంతరం వెళ్లిపోయినట్టు పోలీసులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ (ఆపరేషన్స్) ఎస్‌వీఎస్ రామమూర్తి తెలిపారు. ఈ కారణంగా మధురవాడ, శివశక్తినగర్, ఆర్‌టీసీ కాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం, చంద్రంపాలెం, రేవళ్లపాలెం, దుర్గానగర్, వాంబేకాలనీ, స్వతంత్రనగర్, గణేష్‌నగర్, సాయిప్రియ లే అవుట్, వల్లీనగర్, వుడా కాలనీ, ఎన్‌జీజీవోస్ కాలనీ పరిసర ప్రాంతాల్లో పైన తెలిపిన సమయంలో సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

భీమిలిలో వాతావరణ వైవిధ్యం



తాటితూరు పంచాయతీ మహరాజుపేట వద్ద కురుస్తున్న వర్షం

తగరపువలస: భీమిలి పరిధిలో గురువారం వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులు కనిపించాయి. జీవీఎంసీ పరిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండకాసి, తరువాత మబ్బులు పట్టాయి. తగరపువలస నుంచి గోస్తని నది వరకు ఈ వాతావరణం కనిపించగా అవంతి కళాశాల నుంచి మండలంలోని టి.నగరపాలెం, తాటితూరు, దాకమర్రి, శింగనబంద, లక్ష్మీపురం తదితర పంచాయతీలలో మధ్యాహ్నం 3.30 తరువాత వాతావరణం పూర్తిగా మారిపోయి రెండు గంటల పాటు కుండపోత వాన కురిసింది. దీంతో మండల పరిధిలో జాతీయరహదారి వెంట సర్వీస్‌రోడ్లన్నీ జలమయం అయ్యాయి.

భారీగా కోతకు గురైన తీరం



కోతకు గురైన తీరం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట, రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద సముద్రం సుమారు 30 అడుగులు ముందుకొచ్చింది. అలలు పెద్ద ఎత్తున ఎగసి పడ్డాయి. దీంతో తీరం భారీ ఎత్తున కోతకు గురైంది. రుషికొండ బీచ్ కూడా సముద్రంలో పోటుపాట్లు బలంగా ఉండటంతో బోటు షికారును నిలిపి వేశారు. అదే విధంగా పర్యాటకులను మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డ్స్ అప్రమత్తం చేస్తున్నారు.

గురువులే సమాజ నిర్దేశకులు

- వారిని గౌరవించడం మన బాధ్యత
- మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- ఘనంగా గురుపూజోత్సవం

భీమునిపట్నం: గురువులు సమాజ నిర్దేశకులని, వారి గౌరవించడం మన సంప్రదాయమని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సమాజంలో వారి స్థానం ప్రత్యేకమన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలకు చక్కని విద్యను అందించి, వారు ఉన్నత స్థానాలకు వెళ్లేందుకు ఉపాధ్యాయులు అందించే బోధనలు, ప్రోత్సాహం వెలకట్టలేమన్నారు. దీన్ని విద్యార్థులందరూ గ్రహించాలని, తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులను ఎంతో గౌరవంగా చూడాలని సూచించారు. వారందించే సూచనలు ఎంతో విలువైనవని, వాటిని పాటించాలని హితవు పలికారు. ఉపాధ్యాయులు దిక్సూచి వంటి వారని, అటువంటి వారి మార్గదర్శకత్వంలో భవిత ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సుంకర గిరిబాబు, భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, ముఖ్య నాయకులు మజ్జి వెంకటరావు, బంక సత్యం, యలమంచిలి సూర నారాయణ, అల్లిపిల్లి నర్సింగరావు, ఎస్.కరుణాకరరెడ్డి, ఇ.ఈశ్వరరావు, ఎస్.ఆదినారాయణ, బొడ్డు దుర్గారావు, గాది రోశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు గురువులే దిక్సూచి

విద్యార్థుల భవిష్యత్తుకు గురువులు దిక్సూచిగా ఉండి, వారి ఉన్నతికి ఎంతో సహకరిస్తారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. విష్ణుమూర్తి అన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన సర్వేపల్లి ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

- కేతిన్‌పేట వద్ద గల సన్ స్కూల్‌లో డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పలు వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులకు జ్ఞాపికలందించి, సత్కరించారు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో అధిక మార్కులు విద్యార్థులు 15మందికి మొత్తం రూ.2.25 లక్షల నగదు ప్రోత్సాహకాలను చెక్కుల రూపంలో అందించారు.

ఉపాధ్యాయులకు సత్కారం

పద్మనాభం: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 17 మంది ఉపాధ్యాయులు, ముగ్గురు రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఒక సీఆర్‌ఎంటీని గురువారం ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ, మాజీ ఎమ్మెల్యే ఆర్.ఎస్.డి.పి.అప్పల నరసింహరాజు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు వారిని దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కళిరెడ్డి పాపయ్య కుటుంబ సభ్యులు, అనంత పద్మనాభ స్వామి సేవా సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కళిరెడ్డి దామోదరరావు, మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణమూర్తిరాజు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఎంఈవోలు పి.రమణ, ఎస్‌డీ బాబూలాల్ పాల్గొన్నారు. అనంతరం నలుగురు దివ్యాంగులకు సమగ్ర శిక్షా అభియాన్ సమకూర్చిన వీల్ చైర్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

- గంధవరంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.వి.కె.కె. వర్మ, పల్లి గోవింద పాల్గొన్నారు.

చంద్రంపాలెం హైస్కూల్లో..

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీఎస్ సోమయాజులు, ఇతర ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కేక్ కట్ చేయించారు. తమ గురువులను శాలువాలతో సత్కరించారు.

- వాంబే కాలనీ, సునీల్‌శర్మ కాలనీ, మారికవలస, మధురవాడ తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు రాధాకృష్ణన్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిరంతర విద్యార్థిగా ఉన్నప్పుడే ఉత్తమ బోధన, పరిశోధన సాధ్యపడుతుందన్నారు.

పీఎం పాలెం: గురుపూజోత్సవం సందర్భంగా శిల్పారామంలో జాతర వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సర్వేపల్లికి ఘన నివాళులు

తగరపువలస: చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటానికి పాఠశాల చైర్మన్ చంద్రమౌళి, డైరెక్టర్ అనుపమ జ్యోతిర్మయి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుల కు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

- జీవీఎంసీ బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, ఉపాధ్యాయులు బుగత మల్లిక, పిన్నింటి నాగమణి తదితరులను చిట్టివలస ఎస్‌బీఐ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వి.శ్రీనివాస్, లోకల్ సెక్రటరీ టి.నారాయణ, సిబ్బంది సత్కరించారు.
- ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన్ విహార్‌లో గురుపూజ అనంతరం సీనియర్ అధ్యాపకుడు వై.శ్రీధర్‌ను సరస్వతీ విద్యావిహార్, విజ్ఞాన విహార్ సిబ్బంది, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు సత్కరించారు.



చంద్రంపాలెం హైస్కూల్లో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చిట్టివలస ఎస్‌బీఐ బ్రాంచి సిబ్బంది



చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్‌లో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సన్మాన గ్రహీతలతో నాయకులు



నగదు ప్రోత్సాహక చెక్కులతో విద్యార్థులు



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి



సర్వేపల్లి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న గీతం వీసీ గౌతమ్‌రావు



శిల్పారామంలో సర్వేపల్లి చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఉత్తమ గురువులకు పురస్కారాలు

జిల్లా స్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. నగరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా వారిని సత్కరించి, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ గౌరవం పొందిన వారిలో చిట్టివలస జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ రోజామణి ఉపాధ్యాయిని పీవీ లక్ష్మి, తాటితూరు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం కరుభుక్త సన్యాసినాయుడు, ఆనందపురానికి చెందిన జి.టి.వి.సుదర్శన పట్నాయక్, చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు బి.మధుకొండలరావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని బి.పద్మావతి, కె.నగరపాలెం పరిధి కాపులదిబ్బడ పాలెం లోని ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.వి.ఎల్లాజీరావు ఉన్నారు. డీఈవో ఎల్.చంద్రకళ, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, ఎమ్మెల్సీ చిరం జీవిరావు తదితరులు పాల్గొన్నారు. - తగరపువలస/మధురవాడ/కొమ్మాది



కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న చిట్టివలస జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రోజామణి, చిట్టివలస హైస్కూల్ ఉపాధ్యాయిని పీవీ లక్ష్మి, తాటితూరు ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం సన్యాసినాయుడు, ఆనందపురం ఉపాధ్యాయుడు సుదర్శన పట్నాయక్, చంద్రంపాలెం హైస్కూల్ సోషల్ టీచర్ పద్మావతి, చంద్రంపాలెం హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ మధుకొండలరావు, కాపుల దిబ్బడపాలెం ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం వై.వి.ఎల్లాజీరావు

శ్రీలక్ష్మినగర్‌లో అక్రమ నివాసాలకు నోటీసులు

- ఆక్రమణలపై సాక్షి వరుస కథనాలు
- ఎట్టకేలకు స్పందించిన యంత్రాంగం

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 27, శ్రీలక్ష్మినగర్‌లో కొద్ది నెలలుగా నిరాటంకంగా వెలుస్తున్న అక్రమ నివాసాలను కట్టడి చేసేందుకు ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు కాస్త స్పందించారు. శివశక్తినగర్ మాస్టర్ ప్లాన్ రోడ్డును ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతం ప్రభుత్వ భూమిలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పదుల సంఖ్యలో అక్రమ షెడ్ల నిర్మాణం జరుగుతోంది. ఈ షెడ్ల నిర్మాణంపై సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో అధికారులు స్పందించి, ఆ అక్రమ నివాసాలకు గురువారం నోటీసులు అందించారు. గ్రేడ్–2 వీఆర్వో సువర్ణదేవి ఆధ్వర్యంలో ఇతర సచివాలయ సెక్రటరీలు కొందరికి అందించగా, అందుబాటులో లేని వారి నివాసాల వద్ద వాటిని అంటించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించి ఇళ్లు నిర్మించిన వారికి ఏపీ భూ ఆక్రమణల నిరోధక చట్టం –1958, సెక్షన్5,7 కింద ఫారం–7 నోటీసులు అందజేశామన్నారు. మధురవాడ రెవెన్యూ గ్రామ సర్వే నంబరు 27లో ప్రభుత్వ పోరంబోకు భూమిలో 22 అక్రమ నివాసాలు ఉన్నట్లు గుర్తించి, నోటీసులు అందించామన్నారు. కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ లోకేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నోటీసులు అందిస్తున్న వీఆర్వోలు, ఇతర సిబ్బంది

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న వ్యాపారవేత్త రంగూరి రాంబాబు



చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేస్తున్న దివీస్ యాజమాన్యం



శిల్పారామంలో పాత్రికేయులకు ప్రతిమలను అందజేస్తున్న సీఐ బాలకృష్ణ

తగరపువలస: వినాయక చవితి సమీపించడంతో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ జోరుగా సాగుతోంది. స్థానిక అంబేడ్కర్ కూడలిలో గురువారం వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దాతల సాయంతో 1000 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త రంగూరి రాంబాబు, సొసైటీ చైర్మన్ వెంపాడ శ్రీనివాసరెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు మురళి, వాండ్రాసి సతీష్, సందీప్, బోర చిన్నారెడ్డి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

- భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం మండలంలోని చిప్పాడ, అన్నవరం, పెదనాగమయ్యపాలెం, తూడెం, మూలకుద్దు పంచాయతీలలో విద్యార్థుల ద్వారా గ్రామస్తులకు మట్టి గణపతి విగ్రహాలు అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలనే పూజించాలని సంస్థ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్.రావు తెలిపారు. ప్రధానోపాధ్యాయిని ఎం.వి.టి.రత్నం, సీఎస్ఆర్ సిబ్బంది డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, కె.నరసింహ పాల్గొన్నారు.

మట్టి గణపతే మేలు

పీఎం పాలెం: పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ నూతన సీఐ గేదెల బాలకృష్ణ అన్నారు. స్థానిక పాత్రికేయుడు రమణ సౌజన్యంతో గురువారం ఆయన మట్టి గణపతి విగ్రహాలను పాత్రికేయులకు పంపిణీ చేశారు. పోలీస్ కంట్రోల్ రూమ్ రూరల్ సీఐ వానపల్లి రామారావు, స్థానిక పాత్రికేయులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఏడుగురు జూదరులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెంలో పేకాట శిబిరంపై పీఎం పాలెం పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.40,150 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం రాత్రి 9గంటల సమయంలో పీఎం పాలెం పోలీసు ఇన్‌స్పెక్టర్ గేదెల భరత్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ భరత్ వారి సిబ్బందితో పేకాట శిబిరంపై దాడిచేసి నిందితులను పట్టుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు.

8న 'హెచ్‌పీవీ' వ్యాక్సిన్ బూస్టర్ శిబిరం



డాక్టర్ షిరీన్ రెహమాన్

మహారాణిపేట: జీవీఎంసీ 37వ వార్డు సచివాలయం(ఏవీఎన్ కళాశాల ఎదురుగా)లో ఈ నెల 8న హెచ్‌పీవీ(హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సిన్ బూస్టర్ శిబిరం నిర్వహించనున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16న 9 నుంచి 14 ఏళ్ల లోపు బాలలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ మొదటి డోస్ ఇచ్చినట్లు తెలిపారు. ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం లోపు బూస్టర్ డోస్ వేయాల్సి ఉందన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కేజీహెచ్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని.. ఫిబ్రవరిలో వ్యాక్సిన్ మొదటి డోస్ వేసుకున్న బాలలందరూ బూస్టర్ డోస్ వేసుకోవాలని సూచించారు. బాల్యంలో ఈ డోస్ వేయడం వల్ల పెద్దయ్యాక క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని, తల్లిదండ్రులు తమ పిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలని డాక్టర్ షిరీన్ విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు




తాటితూరులో కోలాటంతో శ్రీకృష్ణుని విగ్రహం ఊరేగింపు

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీత, ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమిలి మండలం తాటితూరు, దాకమర్రిలలో 11 రోజుల పాటు జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం రెండు వేర్వేరు ఊరేగింపులతో ముగిశాయి. తాటితూరులో జరిగిన ఉత్సవంలో విశాఖ, నర్సీపట్నం, రాజాం ప్రాంతాలకు చెందిన వందలాది మంది ప్రబోధానందుని శిష్యులు వెంట రాగా కోలాటంతో తాటితూరు కళ్లాలు, మహరాజుపేట గ్రామాలలో సాగింది. ఇందులో సమితి సభ్యులు బోని రావణ అక్షయ, ప్రసాద్, రమణ, ఆదినారాయణ, పకీర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

- దాకమర్రిలో జరిగిన ఊరేగింపు కార్యక్రమంలో విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు మాట్లాడుతూ దేవుడు మనిషిగా అవతరిస్తే భగవంతుడని అంటారన్నారు. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడన్నారు. కార్యక్రమంలో గాదు వెంకటప్పడు, గాదు వెంకటనారాయణ, ఇందూజ్ఞాన వేదిక , సభ్యులు జి.కృష్ణ, సూరప్పడు, పోలీస్‌నాయుడు, వి.సురేష్, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతాల సరఫరాదారుడు అరెస్ట్



అరెస్ట్ అయిన గోస్వామి

విశాఖ సిటీ: సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతా సరఫరా చేసిన వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివీ.. నగరానికి చెందిన ఓ మహిళకు గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. మీరు సంజయ్ సింగ్ అని, మనీ ల్యాండరింగ్ కేసులో ఉన్నారని, మీ మీద రిపోర్ట్ జనరేట్ అయిందని భయపెట్టాడు. బ్యాంక్ స్టేట్‌మెంట్లతో న్యూఢిల్లీ రావాలని ఫోన్‌లో చెప్పాడు. దీంతో ఆ మహిళ తనకు సంజయ్‌సింగ్ ఎవరో తెలియదని చెప్పినప్పటికీ.. ఫోన్‌లో వ్యక్తి పదే పదే మనీల్యాండింగ్ కేసుల్లో ఉన్నారని, వెంటనే రూ.37 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయకపోతే అరెస్టు చేస్తామని బెదిరించాడు. దీంతో మహిళ భయపడి ఫోన్‌లో వ్యక్తి చెప్పిన బ్యాంక్ అకౌంట్‌కు రూ.37 లక్షలు పంపించింది. వెంటనే ఫోన్ కట్ అయింది. తర్వాత మోసపోయనని గ్రహించిన మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన సైబర్ క్రైం పోలీసులు.. సాంకేతికత సహాయంతో హైదరాబాద్‌కు చెందిన బ్యాంక్ ఖాతాల సరఫరాదారుడైన రాహుల్‌గిరి గోస్వామిని అదుపులో తీసుకున్నారు. అనంతరం విశాఖ తీసుకొచ్చి రిమాండ్‌కు పంపించారు. అతని బ్యాంక్ ఖాతాలో సుమారు రూ.6 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.